క్లుప్తంగా

వెంకాయపల్లె ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



నాగుల కట్ట దగ్గర దిపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్) : జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తికమాసం నేపథ్యంలో మహిళలు నాగులకట్ట దగ్గర దీపలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నూతనవధూవరులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

మురుగు కాల్వ నిర్మాణ పనుల పరిశీలన



కొత్తకోటలో కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసులు చేపట్టిన మురుగు కాలువ నిర్మాణ పనులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ పరిశీలించారు. బీసీ కాలనీలో గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక నిధులతో 130 మీటర్ల పొడవున చేపట్టిన సీసీ డ్రైన్ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆదేవిధంగా స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సైపుల్లాబేగ్ నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవంలో ఏఈ, సర్పంచ్, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించి పంటలను చీడపురుగుల నుంచి రక్షణ కల్పించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండల కేంద్రం సి.బెళగల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ రైతు సేవా కేంద్రం (ఆర్‌ఎస్‌కే) - 2లో రైతులతో సమావేశమై సాగు సూచనలు చేశారు. ఆధునిక, వ్యవసాయ యాంత్రీకరణ వ్యవసాయ పద్ధతులను ఏఓ వివరించారు. అనంతరం పంట పొలాలను ఏఓ పరిశీలించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



శ్యాంపిల్స్ సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ విజయభాస్కర్ పరిశీలించారు. నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్‌ను సేకరించారు. వారి వెంట మండల ఇంజినీర్ ముక్తార్ బాషా ఉన్నారు.

ఎమర్జెన్సీ బర్న్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాలిన గాయాల రోగుల నిర్వహణకు ఇద్దరికి శిక్షణ ఇచ్చారు. న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్, బర్న్స్ సర్జరీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ బ్లాక్ ద్వారా ఎంఎన్‌ఓ రాజశేఖర్, ఎఫ్ఎన్‌ఓ జయమ్మ ఎమర్జెన్సీ బర్న్ మేనేజ్‌మెంట్ శిక్షణ పొందారు. వీరిని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అభినందించారు. ఆసుపత్రిలో ట్రామా, బర్న్ గాయాల నివారణకు ఇలాంటి శిక్షణ పొందడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడి డాక్టర్ మంజులబాయి ఉన్నారు.

చెత్త శుద్ధి లేదు.. సంపద సృష్టి

అసలే లేదు!

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- ముళ్లపొదలతో నిండిపోయిన వైనం
- గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు



కోడుమూరు కేంద్రంలో నిరూపయోగంగా ఉన్న చెత్త సేకరణ రిక్షాలు

కోడుమూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం పట్టింది. దీంతో నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం కోడుమూరుతోపాటు గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో 38 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. అయితే 90శాతానికి పైగా నిరూపయోగంగా మారాయి. దీంతో లక్షలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. చెత్త సంపద తయారీ కేంద్రాల చుట్టు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. అక్కడక్కడ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారిపోయాయి. చెత్త సేకరణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన చెత్త సేకరణ రిక్షాలు, ఆటోలు వినియోగించకుండానే మూలనపడ్డాయి. అలాగే ప్లాస్టిక్ వంటి వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసే యంత్రాలు నిరూపయోగంగా మారిపోయాయి. ఈ యంత్రాలు తప్పుపట్టాయి.

అవగాహన కల్పించని అధికారులు

చెత్త నుంచి సంపద తయారీ ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించడంలో విఫలం చెందారనే విమర్శలు లేకపోలేదు. తొలుత తడి, పొడి చెత్తలను సేకరించే సమయంలోనే ఇండ్ల వద్దనే వేరు చేయాలి. తదుపరి పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించాలి. పొడి చెత్తగా పిలువబడే ప్లాస్టిక్, గాజు సీసాలు వంటి వాటిని విక్రయించడం ద్వారా లాభం ఆర్జించాలి. అలాగే తడి చెత్తను వానపాములకు వేసి వర్మీ కంపోస్టుగా తయారీ చేస్తారు. ఈఎరువును కిలో రూ.8నుంచి రూ.10ల చొప్పున విక్రయించాల్సి ఉంది. అయితే కొన్ని చోట్ల వర్మీకంపోస్టు ఎరువును కొనేవారు లేక టన్నుల కొద్ది ఎరువు వృథాగా పడి ఉంది. ర్మీకంపోస్టు ఎరువు కొనేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

చెత్త సేకరణకు సిబ్బంది కరువు



ముళ్లపొదలతో మూసుకుపోయిన కేంద్రం

ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ అంబాసీడర్లను ఏర్పాటు చేసి వీరికి నెలకు రూ.6వేల వేతనం ఇచ్చేవారు. అయితే ప్రభుత్వాలు వీరికి వేతనాలను ఇవ్వకుండా ఆపి వేశాయి. వీరికి గ్రామ పంచాయతీలే వేతనాలు ఇవ్వాల్సి రావడంతో చాలా పంచాయతీలు నిర్వహణ భారంతో అధికారులు అవసరంమైన మేర సిబ్బందిని ఉంచుకుని మిగిలిన వారిని తొలగించారు. దీంతో ఇంటింటి నుంచి చెత్త సేకరణ చాలా గ్రామ పంచాయతీల్లో నిలిచిపోయింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వీర్యమైపోయాయి.

ఎరువును కొనేవారు లేరు

పంచాయతీ పరిధిలోని కాలనీల్లో ఇంటింటి నుంచి తడి పొడి చెత్తలను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తాం. అక్కడ తడి చెత్త నుంచి ఉపయోగించి వానపాముల ఎరువును తయారు చేస్తున్నాం. అయితే తయారు చేసిన ఎరువును కొనేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో వానపాముల ఎరువును చెత్త నుంచి సంపద తయారు కేంద్రంలోనే నిల్వ చేసి ఉంచాం.

– అజయ్‌భాస్కర్, ఈఓ, మేజర్ గ్రామ పంచాయతీ కోడుమూరు



చెత్త సంపద కేంద్రం వద్ద ఏపుగా పెరిగిన కంప చెట్లు



నిరుపయోగంగా ఉన్న ఆటోలు



కోడుమూరులో మూలనపడిన ప్లాస్టిక్ వస్తువుల కంటింగ్ యంత్రాలు

దివ్యాంగుల సమస్యలను గుర్తించాలి

పాణ్యం: ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను గుర్తించి సొంత జిల్లాలోనే స్లాట్ బుకింగ్ అయ్యేలా చూడాలని ఆదరణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్ష్యుడు మరియదాస్, వికాలంగులు సంక్షేమ సంఘం పాణ్యం మండలం అధ్యక్షుడు వనం రాజు కోరారు. ఈ మేరకు మంగలవారం పాణ్యం సీహెచ్‌సీ ఆసుపత్రిలో జరుగుతున్న సదరం పరీక్షల వారు పరి శీలించారు. దివ్యాంగులకు సొంత జిల్లాలోనే పరీక్షలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇతర జిల్లాల నుంచి వచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

స్త్రీ, పురుషులు సమానమే

కర్నూలు(రూరల్): స్త్రీ, పురుషులు సమానమేనని, తేడాలు తగవని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గార్గేయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలపై వేధింపులను ప్రతిఒక్క రూ వ్యతిరేకించాలన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అని పిలుపు నిచ్చారు.

నివాళి

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి చెందిన మాజీ కేడీసీసీ డైరెక్టర్ చాకిరెడ్డి జయరామిరెడ్డి(88) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి జయరామిరెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాటసాని వెంట సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చంద్రమౌళేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, మధుసూదన్ తదితరలు ఉన్నారు.

సామాజిక వనరులపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కూలీలు

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ పనుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దటేకూరు, బస్తిపాడు గ్రామాల్లో సామాజిక వనరులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మద్దేశ్వరమ్మ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అలాగే భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉలిందకొండ గ్రామంలో పెద్ద చెరువు దగ్గర భారత రాజ్యాంగ దినోత్స వేడుకలు నిర్వహించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈపీ మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి తెలియజేశారు. ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, జిల్లా జైలు సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రతి పేదవాడికి ఉచిత న్యాయం అందాలి

కర్నూలు (లీగల్): స్థానిక ప్రసూనా లా కాలేజీలో వరకట్న వ్యతిరేక దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతి న్యాయ విద్యార్థి విధి అని, రాజ్యాంగ హక్కులే గాక బాధ్యతలు కూడా గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి ఉచిత న్యాయం అందించడంలో భాగస్వాములు కావాలని, వరకట్న నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ పీఠికను స్మరించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ప్రిన్సిపాల్ శివాజీరావు, డీన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను సమూలంగా అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(సెంట్రల్): విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నివారణకు కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఆ కమిటీల ద్వారా మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, అనారోగ్యం, నివారణకు పోలీసులకు సమాచారం ఇచ్చేలా తయారు చేయాలని డీఈఓ, ఆర్‌ఐఓ, యూనివర్సిటీ, మెడికల్ కళాశాలల అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డ్రగ్స్ నియంత్రణపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరప, జొన్న పైర్లలో అంతరంగా గంజాయి సాగు చేస్తుంటారని, తనిఖీలకు వెళ్లిన సమయంలో ఎక్కడైనా గంజాయి కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వ్యవసాయాధికారులకు సూచించారు. కొండ ప్రాంతాల్లో గంజాయి సాగుతోపాటు నాటుసారా కాచే అవకాశం ఉండడంతో వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించారు. ఎన్నికల సమయంలో తీసుకునే చర్యల్లాగే కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని, అక్రమంగా మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు తరలిస్తే పట్టుకొని కేసులు నమోదు చేయాలన్నారు. తండాలపై నిఘా ఉంచి బెల్టు షాపులు ఉంటే ధ్వంసం చేయాలని పోలీసులు, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ.. కౌతాళం మండలం రౌడూరులో 182 గంజాయి మొక్కలను అంతర పంటగా సాగుచేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 30 ప్రభుత్వ, 44 ప్రైవేట్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు హోర్డింగులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులపై కూడా నిఘా ఉంచినట్లు చెప్పారు. అంతకముందు జిల్లా ఎస్పీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు తీసుకున్న చర్యలను వివరించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, కార్మిక శాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి, డీఈఓ శామ్యూల్‌పాల్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఔషధ నియంత్రణ ఏడీ రమాదేవి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం మున్సిపల్ అధికారులతో కలిసి పాత బస్తీలో పర్య టించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాతబస్తీలో ఇరుకైన రహదారుల వల్ల ట్రాఫి క్ సమస్య ఏర్పడుతోందన్నారు. సమస్య పరిష్కారినికి ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అలాగే కొండారెడ్డి బురుజు వద్ద పార్కు, కొత్త బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాల్వల పనులను కమిషనర్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయా లని ఆదేశించారు. మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, డీఈఈ గంగాధర్ ఉన్నారు.

మహోన్నతమైనది భారత రాజ్యాంగం

కర్నూలు (టౌన్): భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు మూల స్తంభం అని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉద్యోగులచే కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, నాయకులు



సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పాణ్యం: మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గుర్తు చేశారు. 75వ రాజ్యాంగం దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ఆ పార్టీ శ్రేణులు ర్యాలీగా వెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ నేడు దేశంలో వెనుకబడిన వర్గాలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అంబేద్కర్ రచించిన రాజ్యంగమేనని చెప్పారు. ప్రతి ఒక్కరు సమాన హక్కులు కల్పించేందుకు అంబేద్కర్ ప్రపంచ దేశాలు పర్యటించి మనకు రాజ్యాంగాన్ని రూపొందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల పల్లవి, కో– ఆప్షన్ సభ్యులు జాకీర్, బాబి, రమణ, రాజానల సుధాకర్, ఉసేన్‌బాషా, శేషయ్య, వడ్డుగండ్ల రాముడు, టైలర్‌బాషా, రమణారెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వెల్డింగ్ చాంద్, నాయకులు సుబ్బరాయుడు, స్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి నివాళి అర్పించిన తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రాజ్యంగం ప్రాముఖ్యతను వివరించారు.

-ప్రజా, విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో రాజ్యంగ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు శివక్రిష్ణ, వెంకటాద్రి, ప్రతాప్, ప్రిన్సిపాల్ పి.వి రామన్, రమేష్, చైతన్య, విగ్నేష్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

కోడుమూరు రూరల్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్.అంబేద్కర్ అని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ చిత్రపటానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జెడ్పీటీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మాదులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, రాఘవేంద్ర, లింగన్న, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు మోడల్ స్కూల్లో...

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోడుమూరు మోడల్ స్కూల్‌లోనూ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి రాజ్యాంగం విశిష్టత, డా.బీ.ఆర్.అంబేడ్కర్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

గూడూరులో...

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్లు పీఎన్ అస్లామ్, లక్ష్మన్నతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రాజ్యాంగం యొక్క విశిష్టత, డా.బీఆర్.అంబేద్కర్ గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నందకిశోర్, కిశోర్, మద్దిలేటి, కుమార్, కలీల్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయరులు దండు శ్రీను, శ్రీకాంత్, రంగన్న, షేక్షా, వలి, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

కల్లూరు: భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని సెట్కూరు సీఈఓ దీప్తి పేర్కొన్నారు. మంగళవారం యువజన సర్వీసుల శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్, న్యాయవాది కురువ నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

కల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగోషాచలరెడ్డి భారత రాజ్యాంగ ప్రవేశికకు సంబంధించిన ప్రతిజ్ఞను చేయించారు. రాజ్యాంగం యొక్క విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ ప్రమీలా రాణి, ఈఓఆర్డీ నాగేష్, ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్) : మండల పరిధిలోని పసుపల గ్రామంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ త్యాగాలను ఎమ్మెల్యే గుర్తు చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత

సి.బెళగల్: రాజ్యాంగ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని ఎంపీడీఓ రాణెమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, అధికారులు, సిబ్బందితో కలిసి ఎంపీడీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో

మండల కేంద్రం సి.బెళగల్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పాండురంగన్న, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు వెంకటేష్, గోపాల్ తదితరులు స్థానిక బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల పాండు, నరసింహుడు, బుడ్డపల్లి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో...

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పరస్కరించుకుని హెచ్‌ఎం నిర్మల వసంత కుమారి అధ్యక్షతన ఉపాధ్యాయులు ప్రజా పరిపాలనపై మాక్ పోలింగ్ నిర్వహించారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



మాట్లాడుతున్న సెట్కూ సీఈఓ దీప్తి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు